క్లుప్తంగా

రిపబ్లిక్ డే పెరేడ్‌కు విజ్ఞాన్ నిరుల విద్యార్థిని ఎంపిక


సాయి సింధు

గుంటూరు రూరల్: రిపబ్లిక్ డే వేడుకలకు తమ కళాశాల విద్యార్థిని ఎంపికవ్వడం సంతోషకరమని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి. రాధిక తెలిపారు. పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విద్యార్థిని అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న సాయి సింధు ఢిల్లీలో దేశ ప్రధాని సమక్షంలో జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనటం సంతోషకరమైన విషయమని తెలిపారు. కళాశాల అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ జ్యోతి తదితరులు విద్యార్థినిని అభినందించారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్


యశ్వంత్‌కుమార్

గుంటూరు రూరల్: ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు ఆలపాటి యశ్వంత్‌కుమార్‌కు అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన డాక్టర్ ఆర్. సుబన్ పర్యవేక్షణలో పెర్ఫార్మెన్స్ ఇమ్‌ప్రూవ్‌మెంట్ ఇన్ మొబైల్ ఎడ్ హాక్ నెట్‌వర్క్ విత్ సెక్యూర్ డేటా ట్రాన్స్‌మిషన్ అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకుడు యశ్వంత్ కుమార్‌ను ప్రిన్సిపల్ కె. శ్రీనివాస్ , కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్, కార్యదర్శి ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ అభినందించారు.

దేశ ఆర్థికాభివృద్ధికి పర్యాటక రంగం దోహదం



ఏఎన్‌యూ: దేశ ఆర్థికాభివృద్ధికి పర్యాటక రంగం దోహదం చేస్తుందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంబీఏ టీటీఎం(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) ఆధ్వర్యంలో బుధవారం జాతీయ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య స్వరూపరాణి ప్రసంగిస్తూ పర్యాటక రంగ ప్రగతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు, ఎంబీఏ టూరిజం కోర్సులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ పి. పూర్ణచంద్రరావు, అధ్యాపకులు ఎస్‌ఏ రెహ్మాన్ సాహెబ్, పలువురు పరిశోధకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



నగరంపాలెం: జాతీయ పర్యాటక దినోత్సవంలో భాగంగా బుధవారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏటీ అగ్రహారంలోని నిర్మల కాన్వెంట్ పాఠశాలలో సంస్కృతి, వారసత్వం అనే అంశాలపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన పి.శ్రీనివాస్, షేక్ వహీదా, షేక్ సమీనాకు జిల్లా పర్యాటక శాఖ అధికారి జి.నాయుడు, ట్రావెల్ భారత్ అధికారిణి ఏ.వి.లక్ష్మి బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.రేణుకాదేవి, అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన భరతమాత పూజా దినోత్సవం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపంపై సంస్కార భారతి ఆధ్వర్యంలో భరతమాత పూజా దినోత్సవం బుధవారం ముగిసింది. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణలతో అలరించారు. అనంతరం గత నెల 13వ తేదీ నుంచి ప్రతి ఆదివారం విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సభలో ముఖ్య అతిథులుగా లంక విజయబాబు, వివేకానంద మఠం మాతాజీ, సామాజిక కార్యకర్త కొత్తూరి సుబ్బారావు, డాక్టర్ కొన్నూరి జయకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఆలయ సభ్యులు, పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సంస్కార భారతి అధ్యక్షుడు ఇండ్ల శ్రీధర్‌బాబు పర్యవేక్షించారు.

ఎల్‌హెచ్‌డీపీ– 5 రకంతో పత్తిలో అధిక దిగుబడులు


జొన్నలగడ్డలో పత్తి పంటను పరిశీలిస్తున్న రైతులు శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన ఎల్‌హెచ్‌డీపీ– 5 రకంతో పత్తి సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించినట్లు మండల వ్యవసాయ అధికారి ఐ. సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డలో బుధవారం రైతులు వంగా నవీన్‌రెడ్డి, నామ శ్రీనివాస్, వంగా శ్రీను సాగు చేసిన విశ్వవిద్యాలయం నూతన పత్తి రకం పంటను శాస్త్రవేత్తలతో కలసి పరిశీలించారు. సాధారణంగా ఏటా సాగు చేసే పంటలకు, ప్రస్తుతం సాగు చేసిన ఎల్‌హెచ్‌డీపీ– 5 రకానికి తేడాల్ని అడిగి తెలుసుకున్నారు. శాఖీయ కొమ్మలు లేకుండా చక్కగా పెరిగిందని రైతులు తెలిపారు. 140–145 రోజుల కల్లా చేను మొత్తం ఒకేసారి కాయలు పగిలి పత్తి తీతకు అనువుగా పంట తయారైందని చెప్పారు. గులాబీ రంగు పురుగును కూడా విత్తనం తట్టుకుందని వివరించారు. ఎకరానికి సుమారు 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని తెలిపారు.

సిబార్ దంత వైద్య కళాశాలలో అత్యాధునిక బోధన

ఘనంగా "వైట్ కోట్" ఉత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ స్టీవెన్ ఆర్. సింగర్, డాక్టర్ మురళీధర్

పెదకాకాని: సిబార్ దంత వైద్య కళాశాలలో అధునాతన పద్ధతుల్లో బోధనలు అభినందనీయమని ప్రొఫెసర్ ఆఫ్ ఓరల్ మెడిసిన్ డాక్టర్ మురళీధర్ ముప్పవరపు తెలిపారు. తక్కెళ్లపాడులోని సిబార్ దంత వైద్య కళాశాలలో బుధవారం 2022 బ్యాచ్ విద్యార్థులకు 'వైట్ కోట్' ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల డీన్ డాక్టర్ లింగమనేని కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ డయాగ్నోస్టిక్ సైన్సెస్ నిపుణులు డాక్టర్ స్టీవెన్ ఆర్. సింగర్, ప్రొఫెసర్ ఆఫ్ ఓరల్ మెడిసిన్ డాక్టర్ మురళీధర్ ముప్పవరపు పాల్గొన్నారు. విద్యార్థులు లక్ష్యాల్ని ఎంచుకుని సాధించే వరకూ పోరాడాలని సూచించారు. ఆప్రాన్ ప్రాముఖ్యతను వివరించారు. వైద్య వృత్తిని బాధ్యతగా నిర్వర్తించాలని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. విద్యార్థులందరికీ ఆప్రాన్ బహూకరించారు. కార్యక్రమంలో సిబార్ డైరెక్టర్ డాక్టర్ టి. కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారెడ్డి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.జె.సాయిశంకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి కంతేరు రైల్వే గేటు మూత


కంతేరు రైల్వే గేటు వద్ద ప్రారంభమైన పనులు

పెదకాకాని: జాతీయ రహదారి నుంచి కంతేరుకు వెళ్లే రైల్వే గేటు (6వ నంబరు) గురువారం నుంచి పూర్తిగా మూసి వేయనున్నట్లు డెప్యూటీ తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర తెలిపారు. గేటు వద్ద అండర్ బ్రిడ్జి పనులు ప్రారంభం కానున్న దృష్ట్యా ఆరు నెలలు పూర్తిగా మూసి వేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ కూడా సిద్ధం చేశారని పేర్కొన్నారు. ఈ గేటు మీదుగా రాకపోకలు సాగించేవారు సమీపంలోని కొప్పురావూరు రైల్వేగేటు (6వ నంబరు)ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

జీబీఏ జనరల్ కార్యదర్శిగా జయపాల్ నియామకం


జయపాల్‌ను అభినందిస్తున్న న్యాయవాదులు

గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్ జనరల్ కార్యదర్శిగా వేముల జయపాల్‌ను నియమిస్తూ జీబీఏ బుధవారం తీర్మానం చేసింది. 2022–2023 ఎన్నికల్లో జాయింట్ సెక్రటరీగా జయపాల్ గెలిచి ప్రస్తుత కార్యవర్గంలో కొనసాగుతున్నారు. ఇదే ఎన్నికల్లో ఇళ్ల మధుబాబు జనరల్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే, ఇటీవల నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రవేశ పెట్టిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థలో డెప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా మధుబాబు నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో నిబంధనల ప్రకారం మధుబాబు జనరల్ కార్యదర్శిగా కొనసాగే అవకాశం లేకపోవడంతో జయపాల్‌ను ఆ పదవిలో నియమిస్తున్నట్లు జీబీఏ ప్రకటించింది. జయపాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జీబీఏ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి, ప్రస్తుత అధ్యక్షుడు పాలడుగు వెంకటేశ్వర్లు, న్యాయవాదులు బ్రహ్మేశ్వరరావు, గుండు శ్రీను, వై.సురేష్, రవి, జీబీఏ కార్యవర్గం జయపాల్‌కు అభినందనలు తెలిపారు.

జాతీయ ఫెలోషిప్‌కు ఎంపిక అభినందనీయం


పరిశోధకులను అభినందిస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: జాతీయ స్థాయిలో యూజీసీ ఫెలోషిప్‌కు పరిశోధకులు ఎంపిక కావడం అభినందనీయమని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. యూజీసీ ఫెలోషిప్‌కు ఎంపికైన యూనివర్సిటీ సోషియాలజీ, సోషల్‌వర్క్ విభాగ పరిశోధకులు కె. ఆవులయ్య, కె. స్వరూప్ పాల్ కుమార్‌ను బుధవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూజీసీ దేశవ్యాప్తంగా నిర్వహించే నెట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి పరిశోధకులు ఫెలోషిప్‌లు పొందడం మంచి పరిణామమన్నారు. పరిశోధన పర్యవేక్షకుడు, సోషియాలజీ విభాగాధిపతి ఆచార్య వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ ఆన్ ఉమెన్- ఏ కేస్ స్టడీ ఆఫ్ ప్రకాశం డిస్ట్రిక్ట్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపైన ఆవులయ్య, 'పబ్లిక్ పర్‌ఫెక్షన్ టూవర్డ్స్ విలేజ్ సెక్రటరియేట్ సిస్టం ఇన్ ఆంధ్రప్రదేశ్: ఇష్యూస్ అండ్ కన్‌స్ట్రైంట్స్' అనే అంశంపై స్వరూప్ పాల్ కుమార్ పీహెచ్‌డీ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగ అధ్యాపకులు ఆచార్య సరస్వతీరాజు అయ్యర్, ఆచార్య త్రిమూర్తిరావు, ఆచార్య ధనలక్ష్మి, పలువురు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉపకార వేతనాల పంపిణీ


విద్యార్థినులతో లక్ష్మీ అన్నపూర్ణమ్మ, ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభావంతులైన విద్యార్థినులకు ఆర్థికంగా చేయూతనివ్వడం ద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసినట్లు అవుతుందని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ట్రస్టీ బొమ్మిడాల లక్ష్మీ అన్నపూర్ణమ్మ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థినులకు ఫీజుల నిమిత్తం రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులకు బొమ్మడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ప్రతి ఏడాది ఉపకారన వేతనాలు అందిస్తూ ప్రోత్సహిస్తోందని చెప్పారు. పూర్వ విద్యార్థినిగా స్పందించి పేద విద్యార్థినులకు చేయూతనందించడానికి లక్ష్మీ అన్నపూర్ణమ్మ ముందుకు రావడం ప్రశంసనీయమని చెప్పారు. ఈ సందర్భంగా లక్ష్మీ అన్నపూర్ణమ్మను కళాశాల అధ్యాపకులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నిర్మల, స్కాలర్‌షిప్‌ల కమిటీ కన్వీనర్ డాక్టర్ చుక్కా ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు

దివ్యాంగుడికి సదరం సర్టిఫికెట్ అందజేత


సదరం పత్రం అందజేస్తున్న ముంతాజ్ పఠాన్

గుంటూరు ఎడ్యుకేషన్: రోడ్డుపై భిక్షాటన చేస్తూ బతుకుతున్న దివ్యాంగుడికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ సదరం సర్టిఫికెట్ అందజేశారు. వైజాగ్ నుంచి గుంటూరుకు వలస వచ్చిన సాయికుమార్ కుటుంబంతో భిక్షాటన చేస్తున్నాడు. ఏడాది కిందట వీరి పరిస్థితిని గురించి తెలుసుకున్న ముంతాజ్ పఠాన్ ప్రభుత్వం నుంచి ట్రై సైకిల్ అందజేశారు. దీంతో పాటు కుటుంబ పోషణకు ఆసరాగా నిలిచేందుకు పెన్షన్ మంజూరు చేయించేందుకు ఇటీవల ఏటీ అగ్రహారంలోని తన కార్యాలయం నుంచే సదరం స్లాట్ నమోదు చేయించారు. బుధవారం కార్యాలయం వద్ద వీరికి సదరం స్లాట్ నమోదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముంతాజ్ పఠాన్ మాట్లాడుతూ శారీరక వైకల్య నిర్ధారణ ధ్రువపత్రం వచ్చిన వెంటనే పెన్షన్ కోసం దరఖాస్తు చేయిస్తామని తెలిపారు.

ఆకట్టుకున్న స్పిక్ మెకే చౌ నృత్య ప్రదర్శన


స్పిక్ మెకే చౌ నృత్య ప్రదర్శనలో కళాకారులు

పెదకాకాని: వివా వీవీఐటీ విద్యాసంస్థల్లోని హెరిటేజ్ క్లబ్ వివా వీవీఐటీ ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ స్పిక్ మెకే విద్యార్థులు బెంగాలి నేపథ్యంతో పురిలియా చౌ నృత్యం అద్భుతంగా ప్రదర్శించారు. భారతీయ సంస్కృతి, శాస్త్రీయ సంగీతం, నృత్యంపై యువతలో ఆసక్తిని పెంపొందించేందుకు స్పిక్ మెకే విద్యార్థులకు ప్రత్యక్ష సంగీత, నృత్య, ప్రదర్శనల్ని అందిస్తోంది. ఇందులో భాగంగా వీవీఐటీ విద్యాసంస్థల్లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన తమల్‌కాంతీ రజక్ బృందం బెంగాల్ మూలంగా గల నృత్యం, యుద్ధకళల సమ్మేళనం పురులియా చౌ నృత్యాన్ని ప్రదర్శించారు. ఆసక్తికర సన్నివేశాల సమూహంతో ఈ నృత్యం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. బృంద నాయకుడు తమల్‌కాంతీ రజక్ విద్యార్థులకు చౌ నృత్యం విశిష్టతను వివరించారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, నృత్యం, సంగీతాలను ప్రత్యక్షంగా విద్యార్థుల వద్దకు తీసుకు వచ్చి ప్రదర్శించే స్పిక్ మెకే వంటి మంచి కార్యక్రమం కళలకు ప్రచారం కల్పిస్తూ పరిరక్షిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అడ్మిన్ ఎన్. కుమారస్వామి, డీన్ ఆఫ్ అడకమిక్ కె. గిరిబాబు, వివా ప్రిన్సిపల్ సీహెచ్. సరళ, ఐబీ సంధానకర్త కె. మాధవి, ఈసీఈ విభాగాధిపతి ఎం.వై. భానుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన ఓటర్ల నమోదులో విజ్ఞాన్ యూనివర్సిటీ ఫస్ట్


ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకుంటున్న విజ్ఞాన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రతినిధి విజయ్‌బాబు

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు ఓటర్ల నమోదులో మొదటి స్థానంలో నిలిచారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి, గుంటూరు రేంజి ఐజీ తివక్రమవర్మ నుంచి యూనివర్సిటీ స్టూడెంట్ అఫైర్స్ ప్రతినిధి పలుకూరి విజయ్ బాబు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నారు. 13వ నేషనల్ ఓటర్స్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థుల అధిక సంఖ్యలో నూతన ఓటర్లగా నమోదు చేసుకున్నందుకు ఈ బహుమతి లభించింది. స్వీప్ కార్యక్రమంలో క్రియాశీలకంగా పనిచేసిన 19మంది విద్యార్థుల్ని, స్టూడెంట్ అంబాసిటర్స్‌గా గుర్తించి ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికల్ని అందజేశారు. చైర్మన్ లావు రత్తయ్య, వీసీ పి. నాగభూషణ్, రిజిస్ట్రార్ రఘునాథన్ తదితరులు అభినందించారు.

ఆడపిల్లల ఆవశ్యకత గుర్తించినపుడే సాధికారత


చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: సమాజంలో ఆడపిల్లల ఆవశ్యకతను ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించినపుడే మహిళా సాధికారత సాధ్యమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో నిర్వహిస్తున్న జాతీయ బాలికా దినోత్సవం బుధవారం ముగిసింది. కళాశాల లేడీ అడ్వైజరీ ఇంటర్నల్ కంప్లైయింట్స్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమం, సమాజ సేవల్లో ప్రత్యేక గుర్తింపు, ఉన్నత స్థానాలకు ఎదిగిన మహిళల జీవిత చరిత్రలతో చిత్రలేఖనం పోటీల్ని నిర్వహించామని తెలిపారు. వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో విజయాలు సాధించిన మహిళల్ని నేటి తరం విద్యార్థినులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, అకడమిక్ డైరెక్టర్ కె. రవీంద్ర చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల లేడీ అడ్వైజరీ కమిటీ కన్వీనర్ జి. సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుల బ్రోచర్ల ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సైన్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను బుధవారం వీసీ ఆచార్య పి రాజశేఖర్ ఆవిష్కరించారు. 'అడ్వాన్సెస్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్' అనే అంశంపై ఫిబ్రవరి 3, 4 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని విభాగాధిపతి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. గంగాధరరావు తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● యూనివర్సిటీ ఐబీఎస్(ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్) విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను బుధవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ' ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ గ్లోబల్ బిజినెస్' అనే అంశంపై మార్చి 24, 25 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని సదస్సు డైరెక్టర్ ఆచార్య ఆర్. శివరామ్ ప్రసాద్ తెలిపారు. ఈ సదస్సుకు దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీలు, పరిశ్రమల నుంచి అధ్యాపకులు, వ్యాపార రంగ నిపుణులు హాజరుకానున్నారని ఆయన చెప్పారు. విభాగ అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

మహిళను వీడియో తీసిన వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: స్నానం చేస్తున్న మహిళను ఓ వ్యక్తి వీడియో తీసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. తుఫాన్ నగర్‌లో నివశించే ఓ కుటుంబానికి చెందిన మహిళ బుధవారం బాత్‌రూంలో స్నానం చేస్తోంది. అదే సమయంలో అంకమ్మరావు అనే వ్యక్తి బాత్ రూము కిటికీలో నుంచి సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. గమనించిన మహిళ కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం



వివాహిత అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆంజనేయపేట 2వ లైనులో నివశించే యర్రంశెట్టి చలపతిరావు బుధవారం ఇంట్లోంచి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి వచ్చి చూసేటప్పటికి తాళం వేసి ఉంది. భార్య అన్నపూర్ణాదేవి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్నపూర్ణాదేవికి మానసిక ఆరోగ్యం సరిగా లేని కారణంగా వెళ్లిపోయినట్లు అందులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని అన్నపూర్ణాదేవిని గుర్తించిన వారు 8688831332కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బహిరంగ మూత్ర విసర్జనకు అడ్డుకట్ట



గుంటూరు ఎడ్యుకేషన్: ఏళ్ల తరబడి నెలకొన్న దుర్గంధానికి పరిష్కారాన్ని చూపించడంలో నగరపాలకసంస్థ అధికారులు సఫలీకృతులయ్యారు. నగరంలోని అమరావతి రోడ్డులో భారత్‌పేట జీరో లైను వద్ద మెయిన్ రోడ్డుపై తీవ్ర అపరిశుభ్రత తాండవిస్తోంది. అన్నదాన సమాజం ఎదుట నడిరోడ్డు పక్కన ఒక భవనాన్ని యజమానులు నిర్లక్ష్యంగా వదిలివేసిన కారణంగా శిథిలావస్థకు చేరి బహిరంగ మూత్ర విసర్జనకు కేంద్రంగా మారింది. దీంతో పాటు ఇటీవల కాలంలో కొంత మంది మందు బాబులు ఇక్కడ పట్టపగలు బహిరంగంగా మద్యం తాగడం కూడా చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం అత్యంత దుర్భరంగా మారింది. శిథిల భవనం వెనుక, పక్కన రెండు ప్రైవేటు ఆస్పత్రులు ఉండటంతో తీవ్రమైన దుర్వాసన, దోమలు వృద్ధి చెంది ఆస్పత్రులకు వచ్చే రోగులు సైతం ముక్కులు మూసుకుని వెళుతున్నారు. సమస్యను నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె ఆదేశాలో రంగంలోకి దిగిన వార్డు సచివాలయ ఉద్యోగులు, శానిటేషన్ విభాగ సిబ్బంది కలసి బహిరంగ మూత్ర విసర్జనకు తావు లేని విధంగా చేశారు. కర్రలతో గోడను నిర్మించి, దానిని పట్టాలు, ఫ్లెక్సీలతో మూసి వేయడం ద్వారా ఎవ్వరు లోపలికి వెళ్లేందుకు అవకాశం లేకుండా చేపట్టిన చర్యలతో ప్రస్తుతం అక్కడ బహిరంగ మూత్ర విసర్జన జరగడం లేదు. అయితే ఇది తాత్కాలికమేనని, శిథిల భవన యజమానులపై చర్యలు తీసుకుని, ఆ ప్రాంతాన్ని శాశ్వత రీతిలో పరిశుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

జీవో 145 రద్దును సద్వినియోగం చేసుకోవాలి

నెహ్రూనగర్: ప్రైవేట్ లే అవుట్స్‌లో 5 శాతం భూమి పేదలకు కేటాయించాలనే జీవో 145ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని, ఈ అవకాశాన్ని వెంచర్స్ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ బుధవారం జి.ఓ.ఎం.ఎస్. నంబర్ 13ని జారీ చేసిందని పేర్కొన్నారు.

వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి వ్యూహాలు అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి పునరుజ్జీవనానికి స్థితిస్థాపక వ్యూహాలు అవసరమని కోనేరు లక్ష్మయ్య విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎం.ఎస్ నారాయణ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ విభాగ ఆధ్వర్యంలో భారతీయ సాంఘిక శాస్త్రాల పరిశోధన మండలి (ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక సహాయంతో ''సాధికార భారతదేశం –75 ఏళ్ల విజయాలు'' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎం.ఎస్. నారాయణ మాట్లాడుతూ 75 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో భారతదేశం వ్యవసాయ రంగంతో పాటు మిగిలిన సేవా రంగాల్లోనూ గణనీయాభివృద్ధి సాధించిందని తెలిపారు. వ్యవసాయ రంగ పునరుజ్జీవనానికి తీసుకోవాల్సిన చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. శాస్త్ర, సాంకేతిక ఫలాలు సామాన్యుడికి చేరువైనప్పుడే ఆశించిన ఫలితాల్ని అందుకోగలమని తెలిపారు. గత రెండు రోజులుగా వివిధ కళాశాలల నంచి వచ్చి పత్ర సమర్పణ చేసిన అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. అనితాదేవి, ఏబీపీ మనోహర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్నామ సంక్షేమ సంవత్సరం కార్యక్రమం వాయిదా

కొరిటిపాడు: పెదకాకానిలోని పేరంటాళమ్మ గుడి ప్రాంగణంలో ఈనెల 27న నిర్వహించ తలపెట్టిన జగన్నామ సంక్షేమ సంవత్సరం కార్యక్రమాలు వాయిదా పడినట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఎప్పుడు జరిగేది త్వరలోనే తెలియజేస్తామని చెప్పారు. ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

గుంటూరు మెడికల్: విధి నిర్వహిణలో నిత్యం బిజీగా ఉండే జర్నలిస్టులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ధృతి హాస్పిటల్ నిర్వాహకులు, సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రేవూరి హరికృష్ణ సూచించారు. ఏపీయూడబ్ల్యూజే గుంటూరు నగర కమిటీ, ధృతి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కొత్తపేట గౌరీశంకర్ థియేటర్ రోడ్డులో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, డాక్టర్ రేవూరి హరికృష్ణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ జర్నలిస్టుల ఆరోగ్యం కోసం ధృతి హాస్పిటల్ తరపున నిరంతరం ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నేతలు పాల్గొన్నారు.

జూదరులపై కేసు నమోదు

పెదకాకాని: పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం అగతవరప్పాడు పరిధిలోని మౌర్య బార్ అండ్ రెస్టారెంట్ వెనుక ముళ్ల పొదల్లో పేకాటలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో బుధవారం దాడి చేశామన్నారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 7,120 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.